కమాన రోడ్డుకు మరమ్మత్తులు చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని గతంలో అనేకసార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేసిన ఇప్పటివరకు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు యశ్వంత్‌రావు, భీంరావు, సోమలు తెలిపారు. రోడ్డు పూర్తిగా గుంతలు, కంకర తేలి నడవలేని పరిస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు మరమ్మత్తులు చేస్తామని గత ఎన్నికల్లో వాగ్దానాలు చేసిన ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదని, మా గోడు వినేదెవరని ప్రశ్నించారు. రాత్రి సమయంలో ఈ రోడ్డు గుండా మండలకేంద్రానికి రావడానికి ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు గుంతలో పడి చాలామందికి అనేకసార్లు గాయాలయ్యాయని, మమ్మల్ని పట్టించుకొనే నాథుడే లేడని వాపోయారు. ఇప్పటికైనా వాంకిడి నుండి కమాన గ్రామం వరకు రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను గ్రామస్తులు వేడుకొంటున్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 26 ఫిబ్రవరి 2023

తొలి దశ ఉద్యమకారులకు మంచి రోజులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తొలి దశ తెలంగాణ ఉద్యమకారులకు మంచి రోజులు రానున్నాయని 1969 తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్న ఉత్తరాది రాష్ట్రాల ఉద్యమకారులకు ఇప్పటికే అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్లు, గౌరవ వేతనాలు ఇస్తూ గౌరవిస్తోందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యమకారులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీనిపై ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించిందని, ఉద్యమకారులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు వెలువరించనున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉద్యమకారులు వారి వద్ద ఉన్న జైలుకు వెళ్లిన ఆధారాలు, ఎఫ్ఐఆర్‌లు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9618960603 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి సంగ్రామ యాత్రను జయప్రదం చేయండి



నవతెలంగాణ-రెబ్బెన

కాగజ్‌నగర్ పట్టణంలోని బాబాసాగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఆదివారం ప్రారంభించనున్న మాదిగల సంగ్రామ పాదయాత్రను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి రేగుంట కేశవరావు మాదిగ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంగ్రామ యాత్ర ఆదివారం ఉదయం 11 :30 గంటలకు ప్రారంభమై కాగజ్‌నగర్ పట్టణ వీధుల గుండా రాజీవ్‌చౌక్, ఎన్‌టీఆర్ చౌరస్తా, చెక్‌పోస్టు నుంచి వంజీరి, వంకులం, కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు నుంచి రెబ్బెన మండలకేంద్రానికి చేరుకుంటుందన్నారు. ఈ సంగ్రామ యాత్రను జయప్రదం చేయడానికి ఎస్సీ వర్గీకరణ సాధనకై మాదిగల ఉప కులాలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చేసే బాధ్యత మాదేనని పలు సందర్భాల్లో హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి దాదాపు 8 ఏండ్లు గడుస్తున్నా వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా మాదిగలను నమ్మించి మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు కొర్రాల రాజేందర్, నాయకులు వడ్లూరి శేఖర్, మాదిగ మహిళా నాయకురాలు కవిత, జంగపల్లి రాజేష్, యువసేనా అధ్యక్షుడు వడ్లూరి వెంకటయ్య, చిలుముల శంకరమ్మ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కెరమెరి

మధ్యాహ్న భోజన సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణమాచారి అన్నారు. శనివారం మండలంలోని సావర్‌ఖేడ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు విపరీతంగా పెరిగినా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడంలేదని విమర్శించారు. కార్మికులకు సబ్సిడిపై గ్యాస్ సరఫరా చేయాలన్నారు. ఇచ్చే కొద్దిపాటి మెనూ చార్జీలతో వంటకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తుందని, దీనితో అప్పులు చేసి ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే కోడి గుడ్లను సరఫరా చేసి కార్మికుల భారాన్ని తగ్గించాలన్నారు. అదేవిధంగా డ్రెస్ కోడ్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, గౌరుబాయి, సావిత్రి బాయి, తుకారాం, పాల్గొన్నారు.

స్కౌట్స్ విద్యార్థులకు అభినందనలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్కౌట్స్ అండ్ గైడ్ టాలెంట్ టెస్ట్‌లో రెబ్బెన మండలం గంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చడంతో వారిని శనివారం జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ అభినందించారు. తెలంగాణ రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి 24 వరకు హైద్రాబాద్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ఈ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ చదువుతో పాటు సేవాభావాన్ని పెంపొందించే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి.శ్యాంరావు, గైడ్ కేప్టెన్ పి.స్వప్న మాస్టర్ ఎం.రాజకమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అన్నారు. యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని శనివారం కాగజ్‌నగర్‌లోని విద్యుత్ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా నాలుగు కోడ్‌లను తీసుకువస్తే దీనిని వ్యతిరేకించిన సంఘం ఏఐటీయూసీఅని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఎనిమిది గంటల పనిదినాన్ని కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, ఉపాధ్యక్షుడు సుధాకర్, పిడుగు శంకర్, బి.కుమార్, జిల్లా కార్యదర్శి మధూకర్, మొగిలి పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని చౌక గ్రామానికి చెందిన సిడాం చిన్న సత్తయ్య-లలిత దంపతులు మృతిచెందడంతో అనాథులుగా మారిన వారి పిల్లలను పెద్ద మనసుతో ప్రభుత్వం, సమాజంలోని పలువురు దాతలు ఆదుకోవాలని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు అన్నారు. శనివారం అనాథలైన పిల్లలను ఆయన పరామర్శించారు. అనంతరం రూ.5 వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలకు అన్ని రకాలుగా ఆదుకొనేందుకు దాతలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఇట్యాల సర్పంచ్ వశాకె మురారీ, మాలీ సంఘం మండలాధ్యక్షుడు మోర్లె నాగేష్‌తో పాటు నాయకులు మధూకర్, కార్తీక్, హాకిరె భీమయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ధగ ధగ ఘరూ..!

ఆదిలాబాద్ జిల్లా అంటేనే అనూహ్య వాతావరణ మార్పులకు కేంద్ర బిందువుగా మారుతుంది. ఇక్కడ మూడు కాలాలు దేనికదే పోటీ పడుతుంటాయి. అధిక వర్షాలు..చలి ప్రభావంతో పాటు ఎండలు సైతం వాటి ప్రతాపాన్ని చూపిస్తుంటాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో మార్చిలో నమోదు కావాల్సిన పగటి ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి చివరాంతంలోనే కనిపించడంతో జనం ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం రోజూ 36డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఎండల తీవ్రతను తెలియజేస్తోంది. మరోపక్క రాత్రి వేళలో మాత్రం వాతావరణం అనూహ్యం మారుతోంది. పగలు ఎండల ప్రభావం ఉండగా.. రాత్రిల్లో చల్లని వాతావరణం కనిపిస్తోంది. వాతావరణంలో మార్పుల కారణంగా జనం జ్వరం, దగ్గుతో పాటు వైరల్ జ్వరాల బారినపడుతున్నారు. మరోపక్క ఎండల తీవ్రత కారణంగా రోడ్లపక్కన చిరువ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్న పేదలు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

- మండుతున్న ఎండలతో జనం
- మరింత పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రాత్రి వేళలో మాత్రం అనూహ్యం మార్పు
- ఇబ్బందుల్లో చిరువ్యాపారులు, రోజువారీ కూలీలు
- వేసవి నేస్తాలకు పెరిగిన గిరాకీ



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా పేరు చెప్పగానే అధిక ఎండలకు నిలయంగా ఉంటుందని చెబుతుంటారు. రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఇతర ప్రాంతాల కంటే ఇక్కడే అధికంగా నమోదు కావడం చర్చనీయాంశమవుతుంటుంది. ప్రస్తుతం ఎండల ప్రభావం తీవ్రంగా ఉండటంతో జనం పగటి వేళలో బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ఎండలు మండిపోతుండటంతో వాటికి అనుబంధ దుకాణాలు తెరుచుకున్నాయి. కొబ్బరిబొండాలు, శీతల పానియాలు, పండ్ల రసాల దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. ముఖ్యంగా రోజువారీ కూలీలు, చిరువ్యాపారులు, వ్యవసాయ వృత్తిదారులు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణవాసులు కొందరు బయటకు వెళ్లే సమయంలో గొడుగులు, ముఖానికి స్కార్ఫ్‌లు ధరించి రక్షణ పొందుతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో కొన్ని చోట్ల తాగునీటి తిప్పలు కూడా ప్రారంభమయ్యాయి. వాగులు, చెరువులు ఎండిపోవడంతో మూగజీవాలు దాహం తీర్చుకోవడానికి అల్లాడుతున్నాయి. ముఖ్యంగా సింగరేణి ప్రాంతంలో ఈ ప్రభావం మరింత అధికంగా కనిపిస్తోంది. భూగర్భగనుల్లో పనిచేసే కార్మికులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రిల్లో అనూహ్య మార్పులు..!

పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉండగా రాత్రి వేళలో మాత్రం చల్లని వాతావరణం కనిపిస్తోంది. వాతావరణంలో మార్పులు కారణంగా అనేక మంది ఫ్లూ జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు వైరల్ జ్వరాల బారిన పడుతుండటంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వ్యవసాయ పనులు ముగిసిపోవడంతో గ్రామాల్లో ఉపాధిపనులు ఊపందుకుంటున్నాయి. చాలా గ్రామాల్లో ఇప్పటికే ఈ పనులు ప్రారంభం కావడంతో కూలీలు ఎండ ప్రభావానికి గురవుతున్నారు. పని ప్రదేశాల్లో అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు పశుగ్రాసం కొరత కూడా ఏర్పడటంతో మూగజీవాలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. మరో ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్
- పీటీజీ పాఠశాల పరిస్థితులపై ఆగ్రహం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలలో అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం, విద్య బోధన పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌టీ డబ్ల్యూ ఆర్ఎస్, పీటీజీ బాలుర పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ క్రమంలో పిల్లలు పడుకునే పడకలు బాగు లేకపోవడం, వాటి క్రింద పందికొక్కులు త్రవ్వడం, పిల్లలు పడుకునే గదులలో ట్యూబ్ లైట్స్ లేకపోవడంతో చీకట్లోనే ఉండడం, పిల్లలు గదుల్లోకి వెళ్ళే మెట్లు కూడా బాబు లేకపోవడం, పిల్లలు పడుకునే ప్రదేశాలలో పరిశుభ్రంగా లేకపోవడం, గదులలో సెల్ఫ్ లు పగిలిపోవడం, గదుల కిటికీలకు దోమలను నియంత్రించే జాలీలు లేక గదుల నిండా దోమలు ఉండడం గమనించారు. పిల్లలకు అందించే ఆహార పదార్థాలు పాడైపోయిన కూరగాయలతో చేయడం, పిల్లలు తినే భోజనశాలలో టేబుళ్లు అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం, కలుషిత ఆహారం, దోమల వలన విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఇలాంటి అభద్రతా వాతావరణంలో పిల్లలు విద్యను అభ్యసించడం కష్టతరమవుతుందని అన్నారు. పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణ కోసం అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. బాల కార్మిక నిరోధక చట్టం ప్రకారం బాలలతో పని చేయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలను చేర్పించి విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

మహిళా చట్టాలతో పాటు వివిధ రకాల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

బీసీలకే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు



నవతెలంగాణ-మంచిర్యాల

రాబోవు ఎన్నికలలో బీసీలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. శనివారం స్థానిక ఎఫ్‌సీఐ హాల్ పొగాకు యాదగిరి ప్రాంగణంలో తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య, దివంగత మాజీ ఎమ్మెల్సీ పొగాకు యాదగిరి చిత్రపటాలకు పూలమాలను వేసి నివాళ్లు అర్పించారు. సమావేశంలో తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయా పార్టీలో ఉన్నటువంటి బీసి నాయకులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షెట్టిపేట్ నియోజకవర్గం ఏర్పడినాటి నుంచి మంచిర్యాల నియోజకవర్గంగా రూపాంతరం చెందిన తర్వాత కూడా ఇప్పటివరకు ఏ ఒక్క ప్రధాన పార్టీ కూడా బీసీలకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన దాఖలాలు లేవని, మంచిర్యాల నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ద్వితీయ శ్రేణి పౌరులు గానే పరిగణిస్తూ బీసీలను రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నాయని అన్నారు. ఈ పరిణామాలను పునరావృతం కాకుండా బీసీలు ఏకతాటిపై ఉండి ఏ పార్టీ బీసీకి టికెట్ ఇచ్చిన ఆ వ్యక్తి గెలుపు కోసం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న అన్ని రాజకీయ పార్టీలు , కుల సంఘాలు ఉద్యోగ సంఘాలు న్యాయవాదులు, డాక్టర్లు, మేధావులు ఏకీభవిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, బేర సత్యనారాయణ, అత్తి సరోజ, కర్రె లచ్చన్న కర్ణ శ్రీధర్, తులా మధు, నీలి శ్రీనివాస్, బేర ప్రభాకర్, ఆకుల సత్తయ్య డోమ్మటి అర్జున్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ అమరేందర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలన్నారు. ఉన్నతస్థాయిలో స్థిరపడి సమాజసేవకు తోడ్పాటునందించాలన్నారు. కళాశాల దశలోనే విద్యార్థులు చెడు అలవాట్లకు తొందరగా ఆకర్షితులవుతారని, అలాంటి వాటికి చోటు ఇవ్వకుండా దూరంగా ఉండాలన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, చదివిన కళాశాలకు, ఉన్న ఊరికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రసాద్‌రాజు, బీఆర్ఎస్ యువజన సంఘం మండలాధ్యక్షుడు పుప్పాల సంతోష్, అధ్యాపకులు చంద్రశేఖర్, నవీన్, నరేందర్, గణేష్, గణపతి పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలలో లావుని పట్టా భూముల సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏజెన్సీ మండలాలైన లింగాపూర్, జైనూర్, సిర్పూర్(యూ) మండలాలకు చెందిన ఆదివాసి నాయకులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని అన్నారు. 1954 సంవత్సరంలో రికార్డులలో ఉన్న వారికి మాత్రమే ఏజెన్సీ ధృవపత్రాలు జారీ చేస్తున్నారని, అంతకుముందు నుండి నివాసం ఉన్నవారికి ఇవ్వడంలేదని ఆదివాసీ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని గ్రామాలలో సాగునీరు, త్రాగునీరు, పోడు పట్టాలు, ఏజెన్సీ ధృవపత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆదివాసి నాయకులు తెలిపిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన వారికి ఏజెన్సీ ధ్రువపత్రాలు జారీ చేసేందుకు, గ్రామపంచాయతీలలో పెండింగ్ బిల్లులు మంజూరు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రహదారులు, వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవడంతో పాటు ఏజెన్సీ గ్రామాలలో విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లలందరూ విద్యను అభ్యసించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, జైనుర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంతురావు, ఆదివాసి నాయకులు ఆత్రం శంకర్, ఉయిక చందన్, మెస్రం మోతిరామ్, మెస్రం నాగోరావు పాల్గొన్నారు.

పశులకు నట్టల నివారణ మందు పంపిణీ

నవతెలంగాణ-భీమారం

సీజనల్ వ్యాధుల పట్ల పశు పోషకులు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా పశు వైద్యాధికారి రమేష్ సూచించారు. మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో శనివారం గొర్రె, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గొర్రె, మేకల వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీవాల్లో ఏర్పడే సీజనల్ వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. రైతులు మూగ జీవాలకు నట్టల నివారణ మందులు ఇప్పించడం ద్వారా వాటిలో రోగ నిరోధక శక్తి వృద్ధి చెంది బరువు ఎదుగుదలలో కలనిపిస్తోందన్నారు. మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న నట్టల నివారణ మందును గొర్రె, మేకల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ శర్మ గ్రామ సర్పంచ్ దాడి తిరుపతి, గ్రామ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ చిలుకల నరేష్, నర్సింగాపూర్ సొసైటీ అధ్యక్షులు యాదవ్, సెక్రటరీ అవరగాని శ్రీనివాస్, ముదిగిరి బిరేష్, దయ్యాల రాజయ్య, దాడి రాజబాబు, దొరికి రాజన్న, ముదిగిరి బానే రఘు, జాగటి రాజన్న, స్వామి పశు వైద్య సిబ్బంది నరసింహులు, సంపత్ పాల్గొన్నారు.

అర్హులకు ఇండ్ల పట్టాలు పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2014 కంటే ప్రభుత్వ స్థలంలో నివాసం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న వారి కోసం ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.58, 59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను శనివారం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ పంపిణీ చేశారు. కలెక్టరేట్ ఏర్పాటు చేసిన పంటాల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి లబ్ధిదారులకు ఇండ్ల పంట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీఓ నెం.58 ప్రకారం జిల్లాలోని 38 మంది లబ్ధిదారులకు 125 గజాల లోపు వారికి ఉచితంగా పట్టాలు అందజేశామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో అర్హులైన లబ్ధిదారులకు మొదటి, రెండవ విడత డీడీలు చెల్లించినట్లయితే వారికి కన్వేయన్స్ డీడ్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వర్, తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే భారీ జరినామాలు

నవతెలంగాణ-నస్పూర్

మాంస విక్రయదారులు (చికెన్, మటన్) వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే భారీ జరిమానాలు తప్పవని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ అన్నారు. శనివారం నస్పూర్ పట్టణములో వీధి కుక్కల బెడద విషయంలో చికెన్, మటన్ విక్రయ యజమానులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో చికెన్, మటన్ వ్యర్థలను బహిరంగ ప్రదేశాలలో పడివేయకూడదని, మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు మాత్రమే వ్యర్థలను అందులో వేయవలసిందిగా తెలిపారు. మాంస దుకాణాల లైసెన్స్ రద్దు చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకోబడునని తెలుపారు. ఈ సమావేశములో రెవెన్యూ ఆఫీసర్ సతీష్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

వీవీ పాట్ల భద్రతకు పటిష్ట చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములో వీవీ పాట్ల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ సంస్థ నుంచి వచ్చిన 891 వీవీ పాట్లను అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీవీ పాట్లను, స్కానింగ్ చేసే ప్రక్రియను పరిశీలించి గోదాములో భద్రపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీవీ పాట్ల భద్రతకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, గోదాము సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని, పూర్తి స్థాయిలో భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాజేశ్వర్, ఆసిఫాబాద్ మండల తహసీల్దార్ రామ్మోహన్ రావు, డీటీలు జితేందర్, పోచయ్య పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన రెండో రోజైన శనివారం కొనసాగింది. వేతన సవరణ గడువు 2022, మార్చి 31తో ముగిసినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం వేతన సవరణ చేపట్టనందుకు ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు జేఏసీ జిల్లా కన్వీనర్ ఎమ్మాజి సతీష్ తెలిపారు.

పదవి విరమణ పొందనున్న అధికారికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

మందమర్రి ఏరియా ఎస్ఓటు జీఎం సీహెచ్ కృష్ణారావును బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ శనివారం సన్మానించారు. ఈ నెలలో ఆయన పదవి విరమణ పొందనున్న సందర్భంగా శాలువాతో సన్మానించి మొక్కను బహూకరించారు. సింగరేణి వ్యాప్తంగా పలు ఏరియాల్లో పనిచేసిన సమయంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.తిరుమలరావు, డీజీఎం(సివిల్) ఆర్.సతీష్‌బాబు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెరా, డీజీఎం(ఎఫ్ అండ్ ఎ) శ్రీరామారావు, పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-బాసర

ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ముధోల్ సీఐ వినోద్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని టాక్లి గ్రామంలో జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ అదేశాల మేరకు భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించగా 60 ద్విచక్ర వాహనలు, ఒక ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన యజమానులు తమ వాహనానికి సంబంధించి పత్రాలు, ఇన్సూరెన్స్ కల్గివుండాలని, రహదారిపై బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. లేనట్లయితే చట్ట ప్రకారం జరిమాన తప్పవని హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్ కార్యక్రమ ఉద్యేశం టాక్లీ గ్రామం మహారాష్ట్రకు సరిహద్దు గ్రామం కావడంతో గుర్తు తెలియని వారు గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై మహేష్ కోరారు. కార్యక్రమంలో ముగ్గురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు 60 మంది కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుంది

నవతెలంగాణ-తాంసి

బీఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు, సీఎం రిలీఫ్ చెక్కులను లబ్దిదారులకు తహసీల్దార్ శ్రీదేవి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి అందజేశారు. అనంతరం రెడ్డి సంఘం కమిటీ నూతన భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని కుల, మత, జాతి, బేదం లేకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని అన్నారు. రెడ్డి సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఇన్‌చార్జీ ఎంపీడీఓ రవీందర్, కన్వీనర్ అరుణ్ కుమార్, ఎంపీటీసీ పండిత నరేష్, నాయకులు వెంకన్న, సదానందం, సంజీవ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

అదిలాబాద్ మండలంలోని తంతోలి గ్రామపంచాయతీ పరిధిలోని సొసైటీగూడలో ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో శనివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్ గోండుల ఆరాధ్య దైవం కుమురంభీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చెందిన యువకులకు ఎమ్మెల్యే జోగు రామన్న అందజేసిన క్రికెట్ కిట్‌ను ఎంపీటీసీ సేవ్వ లక్ష్మి జగదీష్ యాదవ్ అందజేశారు. క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని అన్నారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ లక్ష్మి సుభాష్, ఏఎంసీ డైరెక్టర్ మల్లేష్, గ్రామ పటేల్ తోడసం లక్కు, నాయకులు మోతీరామ్, మనోజ్, వెంకటేష్, సురేష్, నరేష్, బుచ్చన్న, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

హీరా సుక జయంతిని జయప్రదం చేయండి

నవతెలంగాణ-జైనథ్

ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే హిరసుక జయంతికి ప్రతి ఒక్కరూ తరలివచ్చి జయప్రదం చేయాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ మండల అధ్యక్షుడు గంగా ప్రసాద్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో కరపత్రాలతో తమ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ హాజరై జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. అతని వెంట ఉపాధ్యక్షుడు, గేడం విఠల్, గౌరవ అధ్యక్షుడు సిడం రాకేష్, జనరల్ సెక్రటరీ కినాకే సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి పంద్రే సునీల్, సంస్కృతిక కార్యదర్శి గేడం శ్రీనివాస్, నాయకులు సిడం శత్రుఘన్, పంద్రే సుభాష్, మెస్రం రఘురాం, మాడావి భగవాన్, మెస్రం ప్రకాష్ ఉన్నారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన డీఈఓ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం డీఈఓ డీఈఓ రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ ఉపాధ్యాయుల సలహా మేరకు చదువుకోవాలని సూచించారు. విద్యపట్ల ఆసక్తి పెంచుకొని, వార్షిక పరీక్షలకు సంసిద్ధం కావాలని అన్నారు. ప్రతి విద్యార్థి మెరుగైన ప్రతిభను కనబరిచేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారి రవిగౌడ్, ఎస్ఓ సునిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలో శనివారం కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందిందని యజమాని కొట్టే సాయిలు తెలిపారు. ఉదయం పశువుల పాకలో లేగదూడను విధి కుక్కలు పొట్టను చిల్చి చంపేశాయని పేర్కొన్నాడు. వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరారు. పశువుల పాకలో మృతి చెందిన లేగదూడను గ్రామపంచాయతీ కార్యదర్శి గోవిందరాజు పరిశీలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధురాలు మృతదేహం శనివారం లభ్యమైంది. వెంటనే మృతదేహాన్ని పోలీసులు రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతి చెందిన వృద్ధురాలు ఆ ప్రాంతంలో యాచకురాలిగా జీవించేదని స్థానికులు భావిస్తున్నారు. ఆమెను గుర్తుపట్టిన వారు ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై విష్ణు ప్రకాష్ సూచించారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం ఉమ్మాయి శ్యామ్‌రావు తన తండ్రి ఉమ్మాయి గోపయ్య జ్ఞాపకార్థం రూ.12 వేల విలువ గల ప్రింటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లతీఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత ఉమ్మాయి శ్యామ్‌రావును శాలువతో వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు సత్కరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్నాథ్, గీత, పీఆర్టీయూ అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రత్యేక కండ్లద్దాలు పంపిణీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం మండలంలో దిగ్విజయంగా కొనసాగుతుంది. కార్యక్రమంలో భాగంగా కంటి చూపు లోపాలు గుర్తించి, కండ్లద్దాలు అప్పటికప్పుడే అందిస్తున్నారు. ప్రత్యేక కండ్లద్దాలు అవసరం అయితే ఆర్డర్ మీద తెప్పించి, పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేక కళ్లద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం మహోత్తర కార్యక్రమమని, ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుగుణ, వనజ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోని గుర్రపు డెక్కను తొలగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ పరిధిలో ఖానాపూర్ చెరువులోని గుర్రపు డెక్కను తొలగించేందుకు ప్రణాళికలు ప్రతిపాదించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. శనివారం పట్టణంలోని ఖానాపూర్ చెరువు, తిరుపెల్లి ప్రాంతంలోని ఆర్ అండ్ బి ఆధీనంలోని పాత జాతీయ రహదారి, కేఆర్కే కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇండ్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖానాపూర్ చెరువులోని గుర్రపు డెక్క తొలగించి ట్యాంక్ బ్యాండ్‌ను సుందరంగా ఏర్పాటు చేయాలనీ గతంలో కాలనీ వాసులు అభ్యర్థించిన మేరకు మున్సిపల్ అధికారులు గుర్రపుడెక్కను తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. తిర్పెల్లి ప్రాంతంలో ఆర్ అండ్ బి రోడ్డు పనులు కోర్టు ఆదేశాల మేరకు నిలిచిపోయిన ప్రాంతాన్ని కలెక్టర్‌కు ఆర్ అండ్ బి అధికారులు చూపిస్తూ వివరించారు. చాంద సమీపంలోని పాత జాతీయ రహదారి నెం.7కు సంబంధించిన స్థలాలను ఆక్రమణకు గురవుతున్న దృష్ట్యా ఆర్ అండ్ బి మున్సిపల్ అధికారులు సంయుక్తంగా హద్దులు గుర్తించి బోర్డులను ఏర్పాటు చేయాలనీ సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా ఆయా శాఖల అధికారులు హద్దులు ఏర్పాటు చేసుకొని బోర్డులు ఏర్పాటు చేయాలనీ అన్నారు. అనంతరం కేఆర్కే కాలనిలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్దిదారుల ఎంపిక, గ్రామసభల అనంతరం ఇండ్లలోని పెండింగ్ పనులను పూర్తిచేయించాలని అన్నారు. తద్వారా అర్హత గల లబ్దిదారులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇండ్లను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ శైలజ, ఆర్ అండ్ బి ఈఈ నర్సయ్య, డీఈఈ సురేష్, తహసీల్దార్ సతీష్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వాడివేడిగా సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మండల అధ్యక్షుడు మార్శెట్టి గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశం వాడి వేడిగా కొనసాగింది. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. మొదటగా పలువురు అధికారులు తమ నివేదికలను సమావేశంలో వినిపించారు. కొంతమంది సర్పంచ్‌లు తమ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని వీటిని వెంటనే భర్తీ చేయాలని మండల ఎంఈఓకు తెలియజేశారు. అనంతరం ఉపాధి హామీ పనులను గూర్చి అధికారులు తమ నివేదికను తెలియజేయగా మండలంలోని కంఠ, కౌట గ్రామ సర్పంచ్‌లు స్మశాన వాటికలకు కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదని అన్నారు. ప్రతి ఒక స్మశాన వాటికల దగ్గర కేంద్ర ప్రభుత్వం శిలాఫలకాలను నిర్మించాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. గత కొన్ని రోజుల కిందట కంఠ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.కోటి 50 లక్షలతో సీసీ రోడ్డును ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారని అన్నారు. అక్కడ స్థానిక ఎంపీటీసీ కి అధికారులు, నాయకులు ఎటువంటి సమాచారం అందించలేదని నిలదీశారు. తమ కేంద్ర ప్రభుత్వం నిధులు గ్రామాల అభివృద్ధికై ఖర్చు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి డబ్బులు ఇవ్వడం లేదని తెలియడం విడ్డూరంగా ఉందని కౌట సర్పంచ్ విజయ్, అడ సర్పంచ్ పాయల్ శరత్, దీపాయిగూడ ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి అన్నారు. ప్రోటోకాల్‌ని తప్పుదోవ పట్టించినందుకు వెంటనే తమకు క్షమాపణ తెలియచేయాలని నేలపైన కూర్చొని డిమాండ్ చేశారు. ఆడ గ్రామ అభివృద్ధికి ఇప్పటివరకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని సమావేశంలో తెలియజేశారు. ఇకనైనా పక్షపాతాన్ని వీడి ప్రజల అభివృద్ధికై తోడ్పడాలని తెలియజేశారు. ఇరు వర్గాల వాగ్వాదాల మధ్య సమావేశాన్ని అధ్యక్షులు రద్దు చేశారు. అనంతరం బీజేపీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గది ముందర కూర్చొని నిరసన తెలియజేశారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి, ఎంపీడీఓ గజానన్, తహసీల్దార్ రాఘవేంద్రరావు హాజరయ్యారు.

ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేయండి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల ఫిర్యాదులు స్వీకరించి సత్వరమే సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

27న మైనార్టీల చేయూత పథకానికి లక్కీడ్రా

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఆర్థిక సాయం అందజేయుటకు 2022-23 సంవత్సరానికి గాను అల్ప సంఖ్యాకవర్గ లబ్దిదారులు ఆర్థిక సాయం పొందుటకు ఒబిఎంఎంఎస్ ద్వారా 138 మంది లబ్దిదారులు దరఖాస్తులు చేసుకున్నట్లు శనివారం ఎంపీడీఓ కావల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇప్పటి వరకు 71 మంది లబ్దిదారుల దరఖాస్తులు ఎంపీడీఓ కార్యాలయానికి అందాయని అన్నారు. మండలానికి మూడు యూనిట్లు మంజూరైన సందర్భంగా లబ్దిదారులు అందజేసిన దరఖాస్తుల పరంగా ఈనెల 27 న సోమవారం మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 12లకు లక్కీ డ్రా ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న మైనారిటీ లబ్దిదారులు లక్కీ డ్రాలో పాల్గొనాలని కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలతో గిరి పుత్రులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐటీడీఏ డీడీ దిలీప్ అన్నారు. శనివారం స్థానిక కేబీ కాంప్లెక్స్‌లోని క్రీడా మైదానంలో ఉట్నూర్ డివిజన్ స్థాయి విద్యార్థుల ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. జెండా ఊపి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో నాలుగేండ్ల నుండి ప్రారంభమైన క్రీడా పాఠశాలలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. ఈ ఏడాదిలో 160 పతకాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధించడం గొప్ప విషయమని అన్నారు. క్రీడా పాఠశాలను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా డివిజన్ స్థాయిలోను క్రీడా పోటీలు నిర్వహిస్తున్నమని అన్నారు. ఈ నెల 28న జాతర్లలో బోథ్ డివిజన్, మార్చ్ 1న ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో ఆదిలాబాద్ డివిజన్ వారికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నమని అన్నారు. ఈ ఏడాది ప్రారంభమయ్యే వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రవేశానికి విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. అవసరమైతే విద్యార్థుల ఎంపికకు శిక్షణ ఇప్పిస్తామని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల జిల్లా అధికారి పార్థసారధి, ఏటీడీఓ క్రాంతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కార్తీక్ మాట్లాడుతూ వరంగల్ కేఎంసీ పీజీ విద్యార్థిని ప్రీతిని మానసికంగా వేధించిన, సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. నిందితుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అక్షయ్, నిఖిల్ పాల్గొన్నారు.

నట్టల నివారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

నట్టల నివారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బట్టి సవర్గాం సర్పంచ్ రాగం గంగమ్మ అన్నారు. శనివారం మండలంలోని బట్టి సవర్గాం గ్రామంలోని గ్రామ సర్పంచ్ గంగమ్మ మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందును వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు గొర్రెలు, మేకలకు నట్టల మందును కొన్ని కోట్లు వెచ్చించి, సరఫరా చేస్తోందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పశువైద్య అధికారి డాక్టర్ దూద్‌రామ్ మాట్లాడుతూ మన మండలంలో ఈనెల 28 వరకు ఈ క్యాంప్ ఉంటున్నదని అన్నారు. ప్రతి గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దర్శనాల ఏవన్, గ్రామస్తులు గొర్రెల, మేకల పెంపకందారులు సిబ్బంది ప్రసాద్, రమేష్, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మండల రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు బత్తుల అశోక్, సిరిసంపదల సొసైటీ చైర్మెన్ గోర్బాండ్ ప్రకాష్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు త్వరలోనే శనగల కొనుగోలు కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్లినరీలో జిల్లా ముఖ్యనాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ పట్టణంలో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 85వ ప్లినరీ సమావేశంలో శనివారం ఆదిలాబాద్ జిల్లా ముఖ్యనాయకులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతున్న దాడులు, రిజర్వేషన్లపై జరుగుతున్న కుట్రలపై ఈ ప్లీనరీ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ప్రసంగించారు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాడు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలను అక్కున చేర్చుకొని ప్రభుత్వ, ప్రయివేటు సెక్టార్‌లో రిజర్వేషన్లతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించారని అన్నారు. ఈ ప్లీనరీకి సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, డాక్టర్ నరేష్ జాదవ్, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, జిల్లా యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

సీపీఐ(ఎం) ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సీపీఐ(ఎం) పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక పీఆర్టీయూ భవన్‌లో ప్లీనరీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ హాజరవుతారని తెలిపారు. సదరు పార్టీ కార్యక్రమానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు.

తమ గ్రామ హక్కులను కాపాడాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

తమ గ్రామ హక్కులను, హరిస్తున్నారని, హక్కులను కాపాడాలని సర్పంచ్ శ్రీవిద్య అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని బాబాపూర్ గ్రామ హక్కులను నర్సాపూర్ గ్రామ పెద్దలు హరిస్తున్నారని అన్నారు. ఎన్నో ఏండ్లుగా గ్రామానికి వెళ్లే హైవే రోడ్డు దగ్గర బాబాపూర్ క్రాస్ రోడ్డు అని బోర్డు ఉంటే నేడు దానిని చేరిపి తమ గ్రామ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నారని వాపోయారు. ప్రసిద్ధ శివాలయం ఉన్న తమ గ్రామానికి కనీస గుర్తింపు రాకుండా అడ్డుకోవడం తగదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇటీవల ప్రారంభించిన అటవీ చెక్ పోస్టు వద్ద బాబాపూర్ క్రాస్ రోడ్డు అని బోర్డు ఏర్పాటు చేయాల్సిందిగా అటవీశాఖ అధికారులకు విన్నవించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేసి గ్రామ సమస్య తీర్చాలని ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ విద్య, రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మెన్ సురేష్ రెడ్డి, రాజేశ్వర్, నారాయణ, రమణ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైద్‌పూర్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డయల్ యువర్ డిపో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పనతో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మడవర్ హరీష్ రెడ్డి, బేల మండలంలోని సైద్‌పూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మండల కేంద్రం బేల నుంచి సైద్‌పూర్ మార్గంలో బస్సులు నడపడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రయివేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. బస్సు సౌకర్యం కోసం గతంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వివరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీపో మేనేజర్ కల్పన మాట్లాడుతూ వారం రోజుల్లో బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

బీసీ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేవాపూర్ గ్రామ బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీని శనివారం ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు మేకల శ్రీరాములు, అధ్యక్షులుగా చాగంటి నరేష్, ఉపాధ్యక్షులుగా దూస అశోక్, ప్రధాన కార్యదర్శిగా పులివైన సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా పోతుగంటి అశోక్, కోశాధికారిగా నాంపల్లి శ్రీరాములు, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా దాతోజి కిరణ్‌లతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ దేవాపూర్ గ్రామంలో బీసి సంఘాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. నూతన గ్రామ కమిటీతో పాటు మండల నాయకులు మేకల రవికాంత్ యాదవ్, పల్లి(బి) అధ్యక్షులు శ్రీనివాస్‌లను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రమేష్, శ్రీకాంత్, శ్రీరాములు, మోహన్, శ్రీనివాస్, కిరణ్, జక్కుల రవీందర్, అడెల్లు, సంతోష్, పొచ్చన్న పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్‌లో జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎజాజ్ అహ్మద్ ఖాన్ హాజరు కాగా మహమ్మద్ జమీల్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్యక్షుడిగా షాహిద్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఖిజర్ అహ్మద్, ఉపాధ్యక్షుడిగా ఆసిఫ్‌ఉద్దీన్, అఖిల్ అహ్మద్, కోశాధికారిగా షేక్ అస్మత్ అలీ, ఆర్గనైజ్ సెక్రటరీగా అమిమ్ షరీఫ్, సభ్యులుగా సల్మాన్, జాకీర్, అశ్వక్, మహమూద్, మూసను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, కాంగ్రెస్ నాయకులు అర్షాద్, మోసీన్, క్రిసెంట్ గ్రూప్ ఆఫ్ ఇన్సిస్టిట్యూషన్ నిర్వాహకులు బిలాల్ పాల్గొన్నారు.

విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులు

నవతెలంగాణ-చింతలమానపల్లి



మండలంలోని కర్జెల్లి సమీపంలోగల అటవి ప్రాంతంలోని ముసలమ్మ గుట్ట ఆలయంలో గుర్తు తెలియని దుండగులు విగ్రహాలను చిందరవందరగా పడేసిన ఘటన శనివారం రోజు వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన యువకులు వేకు జామున యోగ చేసేందుకు ముసలమ్మ గుట్టకు వెళ తుంటారు. వెళ్లిన సమయంలో బయట ఉన్న విగ్రహాలను, గర్భగుడిలోని విగ్రహాలను చిందరవందరగా వేసి ఉండడంతో వెంటనే ఆలయ కమిటీకి సమాచారం ఇవ్వగా, ఆలయ కమిటీ సభ్యులు పోలీస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి ఎస్సై విజయ్ పోలీస్ సిబ్బంది చేరుకొని, కేసు నమోదు చేశారు.

పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలన

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని ఐటీడీఏ ఆశ్రమ ఉన్నత పాఠశాల, మొగడ్దగడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోదంపెల్లి పాఠశాలల్లో శనివారం పదో తరగతి విద్యార్థుల అతర్గత మార్కులను కమిటీ సభ్యులు పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షల సమయం దగ్గరపడుతుండడంతో ముందస్తుగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆదేశాల మేరకు కౌటాల మండలంలో పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలన బృందాన్ని ఏర్పాటు చేశారు. బృందం నాయకుడు గావుడె హన్మంతు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో మార్కులను పరిశీలించి ప్రధానోపాధ్యాలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముంజం శ్యాంరావు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులు నిలిపేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చెర్లపల్లే చెరువు కట్టపై ఉన్న ఈత చెట్లపై నుంచి విద్యుత్ లైన్ వేయడాన్ని విద్యుత్ అధికారులు నిలిపివేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్ హెచ్చరించారు. శనివారం చెర్లపల్లె చెరువు కట్టపై నుంచి వేస్తున్న విద్యుత్ లైన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ చెరువు కట్టపై ఈత చెట్లపై భాగం నుంచి గతంలో విద్యుత్ లైన్ వేయడం వల్ల వందలాది ఈత చెట్లు కల్లు గీసేందుకు పనికిరాకుండా పోయాయని దీనివల్ల గౌడ కులస్తులు ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. మళ్ళీ ఇప్పుడు కట్టపై ఉన్న కొద్దిపాటి ఈత చెట్లపై నుండి ఒక వ్యక్తి తన స్వార్థం కోసం ట్రాన్స్‌కో అధికారులను ఒప్పించి విద్యుత్ లైన్ వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఇది జరిగితే చెర్లపల్లెకు చెందిన గీతా కార్మికులకు ఉపాధి కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. విద్యుత్ లైన్ వేయడాన్ని ఉపసంహరించుకోవాలని లేనియెడల మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట గౌడ కులస్తులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట కిష్టాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు పోతుగంటి ఎల్లగౌడ్, ఉపాధ్యక్షులు ఉయ్యాల రాజగౌడ్, గీతా కార్మికులు పరకాల తిరుపతి గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

సలహాలు పాటించండి, లాభాలు పొందండి



నవతెలంగాణ-కౌటాల

రైతులు ఏఈఓల సలహాలు పాటించి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండలంలోని తుమ్మిహేటి గ్రామ శివారులో గల పంటల వివరాలను క్రాప్ బుకింగ్ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. అలాగే రైతులకు పలు సూచనలు సూచించారు. రైతులు చిరుధాన్యాల పంటలపై మొగ్గు చూపాలని, చిరుధాన్యాల పంటలతో భూసారం పెరుగుతుంది, అధిక దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి అంజన్న, సర్పంచ్ కోరెత్ చరాందాస్, రైతులు ఉన్నారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలో గొండే రాజన్న(50) అనే రైతు శనివారం ఉద్యుద్ఘాతంతో మతి చెందాడు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. బర్ల దొడ్డిపై నుంచి ఉన్న విద్యుత్ తీగ తెగి బర్ల దొడ్డిపై పడింది. బర్రెలను దొడ్డిలోకి పంపేందుకు వెళ్ళన రాజన్న దొడ్డిపై పడి ఉన్న విద్యుత్ తీగను గమనించకుండా పెన్సింగ్ తీగలను ముట్టుకోగా ఒక్క సారిగా విద్యుత్ ప్రసారం అవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తర్వాత ఒక బర్రె దూడ కూడా మృతి చెందింది. మృతుడికి భార్య, కుమారుడు ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. మృతుని భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్ఎస్ఓ తెలిపారు.

కేసీఆర్‌ది నియంతృత్వ, కుటుంబ పాలన



నవతెలంగాణ-నస్పూర్

ఫామ్ హౌస్ కేంద్రంగా సీఎం కేసీఆర్ నియంతృత్వ, కుటుంబ పాలన సాగిస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి విమర్శించారు. శ్రీరాంపూర్ కాలనీలో బీజేపి జాతీయ అధ్యక్షుడు ఎరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అస్తవ్యస్త ఆర్థిక వ్యవస్థ వల్ల ధనిక రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణ 8 ఏండ్ల పాలనలో సుమారు రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి పడేశారని మండిపడ్డారు. రూ.లక్ష రుణమాఫీ హామీ నెరవేరక, బీమా యోజన లాంటి కేంద్ర పథకాలు అమలు కానివ్వక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అవినీతిలో కూరుకు పోయిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాలేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రూ.లక్షల కోట్ల కుంభకోణం జరిగాయని అన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, పేదవారికి మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఇప్పటివరకు హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో పోనుగోటి రంగ రావు, ఆనంద్ కృష్ణ, పానుగంటి మధు, సత్రం రమేష్, ఈర్ల సదానందం, కుర్రే చక్రి, తిప్పని భీమయ్య, కొండ వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక సింగరేణి ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ నిర్వాహకులు సుధాకర్ తెలిపారు. శనివారం ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను స్థానిక రెండవ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. అనంతరం వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు యాకుబ్ అలీలు మాట్లాడుతూ బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులో గుండె, నరాల బలహీనత, గైనకాలజిస్ట్, ఛాతి కిడ్నీ, మూత్రకోశ, కీళ్ల, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, దంత మొదలగు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వ్యాధులకు సంబంధించిన సూపర్ స్పెషాలిటీ డాక్టర్లచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అంతజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, 9 గంటల నుండి క్యాంపు ప్రారంభమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, రెవెల్లి ఓదెలు, కొక్కుల సతీష్ యువనాయకులు చంద్రకిరణ్, గొనె రాజేందర్ పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- **జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి**
- **సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్**



నవతెలంగాణ-మంచిర్యాల/హాజీపూర్

మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం హాజీపూర్ మండలం రాపల్లి గ్రామం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించిన అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం



పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేస్తుందని, సమయానికి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల వేధింపులు పెరిగిపోయాయన్నారు. స్వంత పనులు కూడా చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. లేదంటే మిమ్మల్ని పనిలో నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అన్ని రకాల కార్మికులకు పెంచినట్లుగా పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబానికి రూ5 లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేయాలన్నారు. కేటగిరీల వారిగానే పనులు చేయించాలని, జీఓ 60 ప్రకారం పరిశుధ్య కార్మికులకు రూ.15,600 వేతనం చెల్లించాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తపాల శాఖ ప్రవేశపెట్టిన రూ.399 ప్రీమియాన్ని కలెక్టర్ చొరవ తీసుకొని ప్రతి కార్మికునికి ప్రీమియం చెల్లించాలని కోరారు. పాదయాత్రలో తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, హాజీపూర్ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు మామిడి రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, చెవిటి మల్లేష్, లిక్కర్ గోదాం యూనియన్ అధ్యక్షులు శంకర్, మాజీ కార్యదర్శి శ్రీనివాస్, మహేందర్ కోశాధికారి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, దూలం శ్రీనివాస్, ప్రకాష్, దాగం రాజారాం, అవునూరి సాగర్, దుమ్మాల సుధాకర్, చిన్నయ్య, రాజలింగు, రవి, లచ్చక్క, సాయి కష్ణ, పద్మ, కొమురయ్య, రాజలింగు, శంకర్, ధర్మయ్య పాల్గొన్నారు.

‘అభివృద్ధి విషయంలో రాజీపడేది లేదు’

- **ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం**
- **ఎమ్మెల్యే దివాకర్‌రావు**



నవతెలంగాణ-మంచిర్యాల

నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడేది లేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తూ ప్రజలకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. శనివారం టీయూఎఫ్ఐడీసీ రూ.2.80 కోట్ల నిధులతో తొమ్మిదవ వార్డులో శ్రీ సాయిబాబా దేవాలయం నుంచి రంగంపేట గ్రామం వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆదర్శవంతమైన అభివృద్ధి సాగుతున్నప్పటికీ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమైన వన్నారు. ప్రజలు మరోసారి తమకు అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, వాస్తవ పరిస్థితులను ప్రతిపక్షలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని వధంగా అన్ని వార్డులలో మెరుగైన అభివద్ధి సాగుతుందని వివరించారు. ప్రజలకు మౌలిక వసతులతో పాటు పార్కులు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ భవనాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్‌లు బొలిశెట్టి కిషన్, తోట తిరుపతి, పల్ల రాజన్న కమలాదేవి, పార్టీ వార్డు అధ్యక్షులు కార్ల తిరుపతి, వేముల గురువయ్య, నాయకులు హనుమంతరావు, శెట్టి శ్రీనివాస్, పెంట ప్రదీప్, కడమండ రమేష్, జెట్టి మల్లేష్, ఉరిమెట్ల తిరుపతి పాల్గొన్నారు.

పరిశోధనలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతాయి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేల ఆరోగ్యము పరిశోధన అనే అంశంపై విద్యార్థులు చేస్తున్న పరిశీలన వారిలో శాస్త్రీయ దక్పథాన్ని పెంచుతుందని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మాజి రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ ఆవిష్కార్ సప్తాహ్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా నేల ఆరోగ్యం పరిశోధన అంశంపై అన్ని పాఠశాలల యాజమాన్యాలతో జూన సమావేశం నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యానికి సంబంధించి రెండు దశల్లో విద్యార్థులు అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. మట్టి నమూనాల ఆకృతిని సేకరించుట, నేల ఆరోగ్యాన్ని విశ్లేషించుట లాంటివి చేయాల్సి ఉంటుందన్నారు. ఇది విద్యార్థులలో పరిశీలన శక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతుందని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా 6 నుండి 12వ తరగతి విద్యార్థులు నేల ఆరోగ్యం పై అధ్యయన చేస్తారని తెలిపారు. మట్టిపై అధ్యయనం చేసిన తర్వాత ఎన్నిక చేసిన 37 పాఠశాలల ఇన్‌ఛార్జీలు ఫలితాలను ఎస్సీఈఆర్టీ వారిచ్చిన గూగుల్ ఫామ్‌లో భర్తీ చేయాలన్నారు. మిగిలిన పాఠశాలల రిపోర్ట్స్ కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చని ఒక హార్డ్ కాపీని డీఎస్ఓకు అందజేయాలన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 27న కాగజ్‌నగర్‌లోని సర్ సిల్క్ పాఠశాలలో నిర్వహించనున్న సెమినార్‌కు జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. ఈ నెల 28వ తేదీన ప్రతి పాఠశాలలో ఎగ్జిబిషన్ ల్యాబ్ మెటీరియల్‌తో సాధారణ ప్రయోగాలు నిర్వహించి విద్యార్థులందరూ వీక్షించే అవకాశం కల్పించాలన్నారు. ప్రతి పాఠశాల యాజమాన్యం కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమములో మామిడాల తిరుపతయ్య, జాడి ప్రవీణ్, లక్ష్మణ్, రాజేశం పాల్గొన్నారు.

‘ఉజ్వల భవిష్యత్తుకు మార్గం విద్య’

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గం విద్యనేనని తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కవ్వాల్, కలమడుగు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మంచిగా చదివి 10/10 జీపిఏ సాధించాలని సూచించారు. చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మహోన్నత వ్యక్తిత్వాన్ని కలిగిన స్ఫూర్తిదాతలు ఉన్నత విద్యను అభ్యసించినవారేనని గుర్తుచేశారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, ఆయా పాఠశాలలకు గ్రామాలకు పేరుప్రఖ్యతలు తీసుకొచ్చే విధంగా విద్యార్థులు పరీక్షలు రాయాలని కోరుకున్నారన్నరు. విద్యార్థులు పరీక్ష సమయంలో ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలన్నరు. అందుకే విద్యార్థులకు పరీక్షకు అవసరమైన ప్యాడ్‌తో పాటు కిట్టును కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కవ్వాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ కలమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయులు



జాడి ప్రభాకర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎండీ రియజొద్దిన్, ఉపాధ్యాయులు రామటెంకి శ్రీనివాస్, నీలం శేకర్, బోర్లకుంట సాగర్, తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్ కుమార్, గట్టు ముజ్జన్న, గంధం రవి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అధికారుల చర్యలు

నవతెలంగాణ-నస్పూర్

కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా ఏరియాల్లో అధికారులు ఇష్టానుతీరంగా వ్యవహరిస్తున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. శనివారం ఆర్కే-7 గనిలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు గుల్ల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్వార్టర్ లేని కార్మికులకు అన్ని ఏరియాలో ఇంటి కిరాయిస్తుంటే మందమర్రి ఏరియాలో ఇవ్వడం లేదన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో కంపెనీ క్వార్టర్‌లను యాజమాన్యంకు తిరిగి ఇచ్చేస్తే అధికారులు తీసుకోవడం లేదని తెలిపారు. పైగా ఇంటికిరాయి కూడా ఇవ్వడం లేదని, నిబంధనలు అన్ని ఏరియాలో ఒక తీరు ఉండగా కొందరు అధికారులు మాత్రం వారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రిటైర్డ్ కార్మికులకు ఎవరి క్వార్టర్ వారికే ఇవ్వాలని మార్చిలో జరగనున్న మహాసభలో తీర్మానం చేసి ఎవరి క్వార్టర్ వారికే ఇప్పించేలా మరోసారి పోరాటానికి రూపకల్పన చేయనున్నామని తెలిపారు. సీనియర్ కార్మికులకు



సర్ఫేస్‌కు అవకాశం కల్పించాల్సి ఉండగా అన్ని డిసిగ్నేషన్ కార్మికులకు సర్ఫేస్‌కు అవకాశం కల్పించకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంఘాలు చేసిన ఒప్పందాలను పట్టించుకోకుండా ప్రవేటికరణపై ఒకరినొకరు విమర్శించుకుంటూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. లేబర్ కమిషనర్ వద్ద చేసిన మారు పేర్లు, సూటబుల్ జాబు, డిపెండెంట్‌ల వయసు పెంపు వంటి ఒప్పందాలపై యాజమాన్యం ఇప్పటివరకు సర్క్యులర్లు ఇవ్వకుండా మెడికల్ బోర్డుకు వెళ్తున్న మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్, ఈపి ఆపరేటర్లకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఇస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. ఇంటి నుండే సేఫ్టీ మొదలు కావాలని చెప్పి హెల్మెట్‌పై నానా రాద్ధాంతం చేసే అధికారులు గనిలో మ్యాన్ రైడింగ్ పనిచేయకపోయినా ఇప్పటివరకు పట్టించుకోవడంలేదని అన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ గోదారి భాగ్యరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, శ్రీధర్, యాదగిరి, అనిల్, ప్రవీణ్, నరేష్, సీనియర్ నాయకులు సంఘం రాజయ్య, రాజేశ్యాం పాల్గొన్నారు.

చింతగూడకు చెందిన మెడికో విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన దాసరి హర్ష(22)అనే మెడికో విద్యార్థి నిజామాబాద్‌లోని తన హాస్టల్ గదిలోనే శనివారం తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని కళాశాల యాజమాన్యం తెలపడంతో విద్యార్థి కుటుంబంలో విషాదచాయలు అల్ముకున్నాయి. నిజామాబాద్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న హర్ష శనివారం పరీక్ష రాయాల్సి ఉంది. ఈ తరుణంలో ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయమైనది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. విద్యార్థి ఆత్మహత్య విషయాన్ని కాలేజ్ యాజమాన్యం కుటుంబ సభ్యులకు తెలపటంతో విషాదం నింపింది. దాసరి శ్రీనివాస్, రాధా దంపతులకు ఉన్న ఇరువురు కుమారుల్లో హర్ష పెద్దవాడు. గ్రామానికి వచ్చినప్పుడు అందరితో ఎంతో ఆత్మీయంగా పలకరించే హర్ష ఆత్మహత్య గ్రామములో విషాదం చోటుచేసుకుంది. అతని మతిపై వారి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హర్ష ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులకు కోరుతున్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

నవతెలంగాణ-కౌటాల

క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో ప్రజాబంధు స్వర్గీయ పాల్వాయి పురుషోత్తంరావు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రశాంత వాతావరణంలో ముగించుకోవాలని, గెలుపోటములు సహజమని, క్రీడాకారులు ఈర్షాద్వేషాలు లేకుండా క్రీడలు ముగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, సత్పుటె భరత్, చాపిలె సురేష్, ఉప సర్పంచ్ ఎలుములె కొండయ్య, నాయకులు నాందేవ్, కుంచాల విజయ్, మధూకర్, దోబె ప్రకాష్ పాల్గొన్నారు.

మండల వాసికి డాక్టరేట్

నవ తెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ సతీష్ కుమార్‌కు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ లభించింది. శనివారం ఢిల్లీలోని సెల్ఫ్ గవర్నమెంట్ డాక్టరేట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టరేట్ కాన్వికేషన్ ప్రోగ్రాంలో సతీష్ కుమార్కు పీహెచ్డ్ పట్టా అందజేశారు. సతీష్ కుమార్ సైకాలజీ విభాగంలో పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగాసతీష్ కుమార్‌ను పలువురు మండలవాసులు అభినందించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న అభ్యాసన కరదీపికలను వినియోగించి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని గుండాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ శంకర్ అన్నారు. శనివారం గుడిపేట్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ సరఫరా చేసిన కరదీపికలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సాయంత్రం అల్పాహారం, నిధులు కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి పాటుపడాలని ఆయన కోరారు.

సిరిపురం మణిహారం నాలుగు వరుసల రహదారి

నవతెలంగాణ-కౌటాల



సిరిపురం మణిహారం కేంద్ర ప్రభుత్వం కానుకగా ఇచ్చిన నాలుగు లైండ్ల రహదారి అని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని వీరవెల్లి, సాండ్‌గాం, కౌటీ గ్రామ శివారులో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి సర్వే పనులు జరుగుతున్న విషయాన్ని తెలుసుకొని శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నాలుగు నెలల క్రితం కేంద్ర రవాణా శాఖ మాత్యులు నితిన్ గడ్కరీకి, ఎంపీ సోయం బాబురావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. కానీ ఇంత త్వరగా ప్రాజెక్టు మంజూరై సర్వే పనులు కూడా పూర్తయ్యే దశలో ఉంటాయని ఊహించుకోలేదన్నారు. బెజ్జూర్, కౌటాల, సిర్పూర్, కాగజ్‌నగర్ మండలాల మధ్యలో భీమిని, దహెగాం సహా 8 మండలాల గుండా ఈ నాలుగు వరుసల రహదారి తాండూరు నుండి వీరవెల్లి వరకు రానుందని ఆయన అన్నారు.

భూములు కోల్పోయిన రైతులు అధైర్య పడొద్దు

నాలుగు వరుసుల రహదారి కోసం భూములు కోల్పోయిన రైతులు ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని, అందరికి నష్టపరిహారం ఇప్పించడం జరుగుతుందని రైతులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట బేజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, సత్పుటి భరత్, చాపిలె సురేష్, ఉప సర్పంచ్ కొండయ్య, నాందేవ్, మొరేశ్వర్, కుంచాలా విజయ్, రాందాస్, ఎలుములె మధూకర్, దోబె ప్రకాష్, పాండురంగ్, రమేష్ ఉన్నారు.

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నవతెలగాణ-హాజీపూర్

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాపల్లి పునరావాస కాలనీలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ అబ్దుల్ హై, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్‌లు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలోనీ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో 700 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులు రక్తం దొరకక ఇబ్బంది పడుతున్నారన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మెగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేశామన్నారు.సేకరించిన ఈ రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులకు, కిడ్నీ డయాలసిస్ పేషంట్ లకు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి డాక్టర్ లహరి, పశువైద్యాధికారి శాంతిరేఖ, సరిత, రాపల్లి సర్పంచ్ ఆనె మల్లేష్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ కాసర్ల శ్రీనివాస్, తలసేమియా సొసైటీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

భూగర్భ జలాలను కాపాడాలని రైతుల ఆందోళన

నవతెలంగాణ-బోథ్

త్రీఫేస్ విద్యుత్ సరఫరా తగ్గించి, భూగర్భ జలాలను కాపాడాలని రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు త్రీఫేస్ సరఫరాను 24 గంటలు కాకుండా, పగలు 12 గంటలు మాత్రమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కరత్వాడ ప్రాజెక్టుకు సంబంధించిన కుడి ఎడమ కాలువలతో పాటు కనుగుట్ట వాగులో నీరు ఎండిపోయి పశువులకు నీటి కష్టాలు అవుతున్నాయని అన్నారు. అలాగే రైతులు స్వచ్ఛందంగా రెండు రోజులు వాగు కాలువలపై నీటి సరఫరాను నిలిపి వేస్తామని తీర్మానించారు. నీటిని నిలిపివేస్తే పశువులకు తాగునీరు అందుతాయని అన్నారు. అలాగే 15 రోజుల వరకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం తగ్గించినట్లయితే రైతులు పండించే పంటలకు చివరి నీటి తడి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ అతికొద్దీన్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఉశన్న తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని తీర్పెల్లి కాలనీలో పాత జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కేఆర్‌కే కాలనీకి చెందిన చౌహన్ సంజు మృతి చెందాడు. కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్న చౌహన్ సంజు ఇసుక ట్రాక్టర్‌పై పనులు చేస్తూ ఉండేవాడు. అయితే పనుల్లో భాగంగా ఆదిలాబాద్ నుండి చాంద వైపు వెళుతుండగా ట్రాక్టర్‌పై కూర్చున్న ఆయన ఒక్కసారిగా కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు కుంటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

దీపం అంటుకొని కిరాణ షాప్ దగ్ధం



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

దీపం అంటుకుని కిరాణ షాప్ దగ్ధం అయిన సంఘటన ఆదిలాబాద్ మండలంలోని తిప్ప గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఆడ మోహేశ్వర్ తన కిరాణాల్లో దీపం ముట్టించి ఉంచాడు. పక్కనే పెట్రోల్ బాటిల్ ఉండటంతో దీపం కూడాతో పెట్రోల్ బాటిల్‌కు అంటుకొని, కిరాణ షాపు దగ్ధమైనట్లు తెలిపారు. దాదాపు రూ.60 వేల విలువ గల వస్తువులు, కిరాణ షాప్ అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. ప్రభుత్వం వెంటనే బాధితుడిని ఆదుకోవాలని సర్పంచ్ కిషన్ కోరారు.

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం చేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు పోతుగంటి లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 33 మంది పోషకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల చదువిస్తున్న తీరు, విద్యార్థుల ప్రగతి, హాజరు శాతం, ప్రవర్తనల గురించి తల్లిదండ్రులతో చర్చించి, పరిష్కార మార్గాలు సూచించారు. పాఠశాల అభివృద్ధికై సలహాలు సూచనలు స్వీకరించి, మన ఊరు మనబడి నిధుల మంజూరు గూరించి చర్చించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక తరగతుల అల్పాహారం గురించి తెలియజేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అభినందించారు. ఏప్రిల్ 3న జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులందరినీ సన్నద్ధం చేసి 100శాతం ఉత్తీర్ణత సాధించటానికి కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మెన్ కదం నర్సింగ్ రావు, వైస్ చైర్మెన్ లక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీస్ ఏజెంట్లకు ఆహ్వానం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆర్టీసీ కౌంటర్లు 4, కమీషన్ మీద ప్రయివేట్ ఏజెంట్ కౌంటర్లు 25, మహారాష్ట్రలో 2 కౌంటర్లు పనిచేస్తున్నాయి. ఇంకా ప్రజల సౌకర్యార్థం వారికి మరింత చేరువ కావడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో తప్పని సరిగా ఉండేటట్లు కమీషన్ మీద ప్రయివేట్ ఏజెంట్‌కు ఇవ్వడానికి నిర్ణయించామని టీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ కె.జానీ రెడ్డి తెలిపారు. ఏదేని షాప్ ఉండి బిజినెస్ చేస్తున్నవారు కంప్యూటర్ పరికరాలు లేదా టీమ్ మెషిన్ ఉన్నవారు అదనపు ఆదాయం కోసం ఈ బిజినెస్ ప్రారంభించవచ్చునని పేర్కొన్నారు. వారికి పార్సిల్ బుకింగ్ మీద 12శాతం కమీషన్, పార్సిల్ రిసివింగ్ మీద ఒక్కోదానికి రూ.10 చొప్పున ఆదాయం లభిస్తుందని అన్నారు. జిల్లా ప్రజలు లాజిస్టిక్ ఏజెంట్ల కోసం దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9154298552, 9154298531, 9154298534, 91542985, 9154298547లను సంప్రదించాలని తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 22న మంచిర్యాల నుండి ఆదిలాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులో ఏ. సురేష్ అనే ప్రయాణికుడు మంచిర్యాలలో బస్సు ఎక్కి ఆదిలాబాద్ వచ్చేటప్పుడు అనుకోకుండా ఇంధన్‌పల్లిలో దిగాడు. తొందరలో తన సెల్ ఫోన్ బస్సులోనే మర్చిపోయాడు. డీవీ బాబు కండక్టర్ ఆ ఫోన్‌ని గమనించి, ఆదిలాబాద్ డిపోలో అప్పగించారు. శనివారం డిపో మేనేజర్ కల్పన చేతులు మీదుగా బాధితుడికి ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ యజమాన్యానికి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసీ విద్యార్థి సంఘం కళాశాల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ ఏర్పాటుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సిడాం జంగుదేవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పాలకులు ఆదివాసుల విద్యాభివృద్ధి పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఆశ్రమ పాఠశాలలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక కష్టాలు పడుతున్నారని వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు హాస్టళ్లను సందర్శించాలని కోరారు. ఆదివాసుల విద్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ కళాశాల అధ్యక్షులుగా గేడం సుభమ్, ప్రధాన కార్యదర్శిగా రాయిసిడాం నాందేవ్, ఉపాధ్యక్షుడుగా ఆత్రం రాజేష్, కార్యదర్శి మడావి ఆకాశ్, కోశాధికారిగా ఆలం అంజన్న, సభ్యులుగా మడావి శేఖర్, దుర్వ టుల్లు, రాయిసిడం మారుతి, బి.దశరత్, పి.వినయక్ రావులు ఎన్నికయ్యారు.

సావర్‌ఖేడను సందర్శించిన డిప్యూటీ పీఆర్ కమిషనర్ రామారావు

నవతెలంగాణ-కెరమెరి

సావర్‌ఖేడ గ్రామాన్ని డిప్యూటీ పీఆర్ కమిషనర్ రామారావు శనివారం సందర్శించారు. ఉత్తమ గ్రామపంచాయతీ ఎంపిక కార్యక్రమంలో భాగంగా సందర్శించి, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో కలియ తిరిగారు. పరిశుభ్రతను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యాబోధనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు, గర్భిణీ, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. జిల్లాలోని మర్లవాయి, సావర్‌ఖేడ, వేంపల్లి జీపీలలో ఉత్తమ జీపీని ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రమేష్, ఎంపీడీఓ సత్యనారాయణ, సర్పంచ్ కావుడే తులసిరాం, ఎంపీఓ సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల పాదయాత్ర ● ఎంపీడీఓకు వినతిపత్రం



నవతెలంగాణ-ఖానాపూర్

గ్రామపంచాయతీ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో తర్లపాడు నుండి ఖానాపూర్ వరకు కార్మికులు పాదయాత్ర చేపట్టారు. అంతకు ముందు తర్లపాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నిర్మల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామపంచాయతీ పాదయాత్రకు సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు జీఓ నెం.60 ప్రకారం వేతనాలు పెంచాలని అన్నారు. జీఓ నెం.51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ల విధానం రద్దు చేయాలని అన్నారు. కారోబారిలకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. అంతేకాకుండా గత 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు లేక పోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులకు వేతనాలు విడుదల చేయకపోవడంతో ఇల్లు గడవలేని పరిస్థితిలో కార్మికులు ఉన్నారని అన్నారు. కార్మికులకు ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు విడుదల చేసి 11వ పీఆర్సీ వర్తింపజేసి 30శాతం జీతం పెంచాలని అన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని లేదా జీఓ 60 ప్రకారం రూ.15వేల 600 వేతనం నిర్ణయించాలని అన్నారు. జీఓ 51 రద్దు చేయాలని లేకపోతే కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మున్సిపాలిటీ కార్మికులకు ఏ విధంగా అయితే వేతనాలు ఇస్తున్నారో అదే విధంగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని అన్నారు. సబ్బులు, యూనిఫామ్, బెల్లం, నూనె,తో పాటు ఆదివారం కూడా సెలవు ఇవ్వాలని అన్నారు. కార్మికుల పట్ల అధికారుల వేధింపులు అరికట్టాలని మల్టీపర్పస్ విధానాలతో కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ, వేతనాలు మాత్రం సక్రమంగా ఇవ్వడం లేదని అన్నారు. అప్పులతో తమ కుటుంబాన్ని గడిపే పరిస్థితి కార్మికులకు ఏర్పడిందని అన్నారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. సిబ్బంది కి ఉద్యోగ భద్రత కల్పించి, పి ఎఫ్ , ఈ పి ఎఫ్ , ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాకూర్ తిరుపతి, సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి, నాగేలి నర్సయ్య, మండల కార్యదర్శి శేఖర్, మండల అధ్యక్షుడు నాగరాజు, మండల కార్యదర్శి, స్వామి కోశాధికారి, పోశెట్టి, రవి రాకవ్వ, రాజేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.



కమ్యూనిస్టు ప్రణాళికే రెడ్ బుక్ డే

● డీవైఎఫ్ఐ ఆసిఫాబాద్ కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రజల్లోకి వెళ్లే ప్రణాళికే రెడ్‌బుక్ డే అని డీవైఎఫ్ఐ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. శనివారం ప్రజా సంఘాల కార్యాలయం ఆసిఫాబాద్‌లో ప్రపంచ "రెడ్‌బుక్ డే" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా "భారత విప్లవ కెరటం భగత్ సింగ్" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. రెడ్ బుక్ డే సందర్భంగా కమ్యూనిస్టు మ్యానిఫెస్టో 175 సంవత్సరాల క్రితం అంటే 1848 ఫిబ్రవరి 21న పెట్టుబడిదారీ వ్యవస్థ నగ్నస్వరూపాన్ని బట్టబయలు చేసిన పుస్తకం ఇది. ప్రపంచ శ్రామిక వర్గానికి కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు యిచ్చిన సిద్ధాంత ఆయుధం అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బంధనాల నుండి శ్రామిక వర్గానికి చూపిన విముక్తి మార్గం, నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాలక్ష సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక దిక్సూచి "కమ్యూనిస్టు మ్యానిఫెస్టో" అన్నారు. అలాంటి మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రెడ్ బుక్ డేను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ రోజు భగత్ సింగ్ చరిత్రను గుర్తించి తన మిత్రుడు శివవర్మ రచించిన భారత ఉద్యమ కెరటం భగత్ సింగ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ పుస్తకాన్ని యువతీ, యువకులు చదివి ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, గెడం టికనంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జాదవ్ రాజేందర్ పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ : డీఈఓ



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంతో పాటు ధని, జామ్, స్వర్ణ, మలక్ చించోలి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను శనివారం జిల్లా విద్యాశాఖాదికారి డా.రవీందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులతో మాట్లాడి వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపారు. చదివేటప్పుడు ఏమైనా సందేహాలు వస్తే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కౌట్ల(బి) పాఠశాలలో నిర్వహించిన పోషకుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదో తరగతి అనేది చాలా కీలక దశ అని తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరిస్తేనే మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని అన్నారు. ఇంటి వద్ద పిల్లలకు చదువుకునే వాతావరణం కల్పించాలని అన్నారు. ఈ 35 రోజులు పిల్లలను టీవీకి, సెల్‌ఫోన్‌కి దూరంగా ఉంచాలని అన్నారు. పరీక్షలు పూర్తి అయ్యేవరకు వారి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రివిజన్ పరీక్షలు, ప్రీఫైనల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో భయం తొలగి పోయి వార్షిక పరీక్షలు బాగా రాయగలమనే నమ్మకం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు కూడా మంచిగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. వీరి వెంట జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త రవిగౌడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

డీటీసీకి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డా.పుప్పాల శ్రీనివాస్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించింది. శనివారం గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నిర్వహించిన ఆరోగ్యం, భద్రత, పర్యావరణం, సుస్థిరత వార్షిక అవార్డు వేడుకలను నిర్వహించి, అవార్డును అందజేశారు. రోడ్డు భద్రత ప్రమాణాలను మెరుగుపరచడంలో, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి, సమాజంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలు తగ్గించి ప్రాణాలు కాపాడేందుకు గణనీయంగా కృషి చేసినందుకు ఈ వేడుకల్లో ఆయనను లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల సభ్యులు అభినందనలు తెలిపారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా పలు మండలాల, గ్రామాల నుండి డీఎంకు కాల్ చేయగా డీఎం కల్పన సమాధానాలు ఇచ్చారు. బేల నుండి హరీష్ రెడ్డి ఫోన్ చేసి సైద్‌పూర్ నుండి బేల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందుకు డీఎం రోడ్ సర్వే నిర్వహించి, అతి త్వరలో బస్సును ప్రారంభిస్తామని అన్నారు. నిర్మల్ నుండి శ్రీకాంత్ ఫోన్ చేసి ఉట్నూర్ నుండి నిర్మల్‌కి బస్సు సౌకర్యం కల్పించాలని అడిగారు. అందుకు డీఎం ఈ విషయాన్నిపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. నిర్మల్ నుండి జీఎస్ రాజు ఫోన్ చేసి ఉట్నూరు నుండి నిర్మల్‌కి బస్సు సౌకర్యం గురించి, ప్రయాణికుల అభీష్టం మేరకు ఈ విషయాన్నిపై అధికారులు దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. తర్నం నుండి అశ్విని ఫోన్ చేసి బేల సర్వీసులను వయా తర్నం నుండి ఎప్పుడు నడిపిస్తారని అడిగారు. అందుకు డీఎం తర్నం వంతెన మరమ్మతు ఉన్నందున బేల సర్వీసులను వయ లాండసాంగ్వి నుండి నడుపుతున్నామని పేర్కొన్నారు. వంతేన మరమ్మతులు పూర్తి అయిన తర్వాత వాయ తర్నం నుండి బస్సులు నడుపుతామని తెలిపారు.

42 మందికి కంటి పరీక్షలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 42 మందికి పరీక్షలు నిర్వహించగా, 30 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆసుపత్రి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ శనివారం నిర్వహించే కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రానికి చెందిన కొడపతి సాయికృష్ణ(29) ఈ నెల 22వ తేదీ నుంచి అదృశ్యం అయ్యాడని ఎస్సై సాగర్ తెలిపారు. సాయికృష్ణ తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బుల్లెట్(టీఎస్ 20 5455)పై కాగజ్‌నగర్ వైపు స్నేహితుడికి డబ్బులు ఇచ్చేది ఉందని చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు కూడా కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో స్నేహితులకు, బంధువులకు తెలిపినా అచూకీ లభించలేదు. పోచయ్యకు వరుసకు అల్లుడైన భిక్షపతికి రెబ్బెన మండలకేంద్రంలో రైల్వేస్టేషన్ వద్ద అతని బుల్లెట్ మోటార్‌సైకిల్ కనిపించిందని చెప్పినట్టు ఆయన తెలిపారు. ఎవరికైన నా కుమారుడు కనిపిస్తే ఫోన్ నెంబర్ 8008082952, 6302757542కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యార్థుల చదువుల పట్ల దృష్టి సారించాలి



నవతెలంగాణ-బోథ్

విద్యార్థుల చదువుల పట్ల ప్రతి ఉపాధ్యాయుడు దృష్టి సారించాలని డీఈఓ టి.ప్రణీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ప్రీఫైనల్ వార్షికోత్సవం పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అలాగే విద్యార్థులు చదువుల్లో రాణించాలని అన్నారు. డీఈఓ వెంట ప్రిన్సిపాల్ ఉమేష్, కాంప్లెక్స్ హెచ్ఎం పిల్లి కిషన్, సీసీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో చోరికి యత్నం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీకి యత్నించి విఫలమైన సంఘటన మండలంలోని కాల్వ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులు దీనిని గమనించారు. ఆలయం వైపు పెట్రోలింగ్‌కు వెళ్లిన కానిస్టేబుల్ పోచ్చన్న, హోంగార్డు వెంకటరమణలు ఆలయ ద్వారం తెరిచి ఉన్నది చూసి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నిస్తున్నారని అనుమానంతో ఆలయంలోకి వెళ్లి చూడగా పోలీసులను చూసిన దొంగ పారిపోయాడు. దొంగ దొంగతనానికి తెచ్చుకున్న పనిముట్లను అక్కడే వదిలేసి పరారయ్యాడు. పోలీసులు సరైన సమయంలో అటు వైపు వెళ్లడంతో దొంగతనం విఫలమైంది. ఆలయంలో దొంగతనం జరిగేదని ఎస్సై గంగాధర్ వారిని ప్రశంసించాడు. దొంగతనం శుక్రవారం రాత్రి సమయంలో జరిగినా పోలీసులు శనివారం రాత్రి వరకు గ్రామస్తులకు గాని, ప్రకటన గాని చేయలేదని, సమాచారం ఇవ్వలేదని గ్రామస్తులు పలువురు ఆరోపించారు. దేవాలయ జూనియర్ అసిస్టెంట్ మాధవరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిర్పూర్(యు) మండలంలోని బండేయేర్ గ్రామపంచాయతీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ సర్పంచ్ గంగాదేవి దేవరావు ఎమ్మెల్యే ఆత్రం సక్కు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల మంజూరు చేయాలని కోరారు. అలాగే పంచాయతీలో సీసీ రోడ్డుతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని అన్నారు. ఎమ్మెల్యే తమ సమస్యలు పరిష్కరించడానికి అంగీకరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, గ్రామ నాయకులు కుమురం భీంరావు పాల్గొన్నారు.

ఘనంగా అవతార్ మెహర్ బాబా జయంతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అవతార్ మెహర్ బాబా జయంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తాటిపెల్లి రాజేశ్వర్, తాటిపెల్లి అశోక్, గిరీష్, సతీష్, ఆశిష్, బట్టుపెల్లి అశోక్, నోముల చంద్రమోహన్, బట్టుపెల్లి సంతోష్ పాల్గొన్నారు.

గ్రామ అధ్యక్షుడుగా మునేశ్వర్

నవతెలంగాణ-బోథ్

బీఆర్ఎస్ పార్టీ సొనాల గ్రామ అధ్యక్షుడిగా మునేశ్వర్ సోమన్నను శనివారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నియమించారు. సొనాల గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే ఆయా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నాపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు బీఆర్ఎస్ పార్టీ గ్రామంలో బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ క్యాలెండర్‌ను శనివారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు అక్రమ్ ఖాన్, రిమ్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బెజ్జూర్

ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మాధవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రైతువేదికలో ఈ సమావేశం ఉంటుందని, సమావేశానికి మండలంలోని అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమతమ నివేదికలతో సమయానికి హాజరుకావాలని కోరారు. సమావేశానికి హాజరుకానీ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.